పిల్లలు బాగా చదువుకోండి

విద్యార్థులతో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు సూచించారు. భగత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ, నగరపాలక సంస్థ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పాఠశాలలో సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదవాలని సూచించారు. -కార్పొరేషన్, జనవరి 5

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 5: ప్రజాపాలన కార్యక్రమంతో ప్రభుత్వం నిజమైన పాలనకు శ్రీకారం చుట్టిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని సర్వారెడ్డిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగంగా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం గ్యారెంటీలను అమలు చేశామన్నారు. మిగతా నాలుగు గ్యారెంటీలు అమలు చేస్తామని పేర్కొన్నారు. జడ్పీటీసీ పుల్కం అనురాధా నర్సయ్య, సర్పంచు చిలుముల మంజులారమేశ్, ఎంపీటీసీ దుబ్బాసి శంకరమ్మ-బుచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

చొప్పదండి, జనవరి 5: చొప్పదండిలోని వేంకటేశ్వర మణికంఠాలయం తొమ్మిదో వార్షికోత్సవానికి ముస్తాబవుతున్నది. శనివారం గణపతి పూజ, కోటిలింగాలలో ఆరట్టు మహోత్సవం, సాయంత్రం శోభాయాత్ర, ఆదివారం గణపతి హోమం, మూలవిరాట్‌కు అభిషేకం, సాయంత్రం మహాపడిపూజ నిర్వహించనున్నారు.

జమ్మికుంటలో టెన్షన్.. టెన్షన్

- మున్సిపల్ సాధారణ సమావేశానికి కాల్ ఫర్ చేసిన చైర్మన్
- ఎక్స్ అఫిషియో సభ్యుడి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు
- ఎట్టకేలకు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే పేరు నమోదు
- దీంతో మున్సిపల్ సమావేశం రద్దు.. ఊపిరి పీల్చుకున్న అన్ని వర్గాలు

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జనవరి 5: హైదరాబాద్ కేంద్రంగా జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం క్యాంపు రాజకీయాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పెద్దల ఎత్తులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు కదుపు తున్న పావులు సర్వత్రా టెన్షన్ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వారం రోజుల నుంచి రెండు వర్గాల పాలకవర్గ సభ్యుల క్యాంపులు అనూహ్యమైన మలుపులు తిరుగుతున్నాయి. గత నెల 29న 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య అవిశ్వాసానికి తెరతీయగా, మరుసటి రోజు 23 మంది సభ్యులతో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు అవిశ్వాసానికి వ్యతిరేకంగా కలెక్టర్‌కు కాపీని అందించారు. దీంతో ఇరు వర్గాలు క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టాయి. ప్రస్తుతం ఇరు వర్గాలకు చెరో 15 మంది సభ్యుల మద్దతు ఉంది. ఈ నేపథ్యంలో ఎక్స్ అఫిషియోగా ఎమ్మెల్యే మద్దతు కీలకం కానుంది. హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల సభ్యుడిగా నమోదు కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. నమోదు ఆలస్యమవుతుండడంతో చైర్మన్ వర్గం వేగంగా పావులు కదిపింది. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పాలకవర్గం శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యేకు ఆమోదం తెలిపి, ప్రమాణ స్వీకారం చేయించేందుకు చైర్మన్ వర్గం క్యాంపు నుంచి జమ్మికుంటకు బయల్దేరారు. దీంతో ఒక్కసారిగా జమ్మికుంటలో వాతావరణం వేడెక్కింది. క్యాంపులో ఉన్న ఇరు వర్గాలకు చెందిన అభిమానులు మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాలకు చేరుకున్నారు. అలాగే చైర్మన్, మల్లయ్య వర్గాలిద్దరూ సమావేశానికి హాజరవుతుండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణ సీఐ రమేశ్, ఎస్ఐలు శ్రీధర్, రాజేశ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట భారీ బందోబస్తు చేపట్టారు. ఉదయం 10గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా.. మధ్యాహ్నం 2గంటల వరకు దాదాపు 5గంటల సేపు ఏం జరుగుతుందో..? అని ఉత్కంఠ రేపింది. అయితే కౌన్సిల్ సభ్యుడిగా ఎమ్మెల్యేకు, కలెక్టర్ ఆమోదం తెలిపినట్లు చైర్మన్ వర్గానికి సమాచారం రావడంతో మున్సిపల్ సమావేశం రద్దు అయింది. చైర్మన్ వర్గం మళ్లీ హైదరాబాద్ క్యాంపునకు తరలివెళ్లింది. దీంతో అన్ని వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

25న అవిశ్వాస బల ప్రదర్శనకు నోటీసులు

30 మంది కౌన్సిల్ సభ్యులున్న జమ్మికుంట మున్సిపల్‌లో చైర్మన్ రాజేశ్వర్‌రావుకు 29 మంది సభ్యుల మద్దతు ఉండేది. 23వ వార్డు కౌన్సిలర్ మల్లయ్య కాంగ్రెస్‌లో చేరడంతో పాటు తనకు పలువురు సభ్యుల మద్దతు ఉందని డీఆర్వోకు అవిశ్వాస తీర్మాన పత్రం అందించాడు. బీఆర్ఎస్ విప్ జారీ చేస్తామనడంతో పాటు 23 మంది కౌన్సిలర్ల మద్దతు తమకే ఉందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కలెక్టర్‌కు తీర్మాన పత్రం ఇచ్చారు. దీంతో ఇద్దరికీ సమానంగా సభ్యుల మద్దతుందని తెలుస్తోంది. ఎక్స్ అఫిషియో సభ్యుడి మద్దతుతో చైర్మన్‌కు 16 మంది సభ్యులున్నారు. అవిశ్వాస బల ప్రదర్శన ఈ నెల 25న జరుగనున్నదని, కలెక్టర్ నోటీసులు సైతం జారీ చేశారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. వందశాతం తామే గెలుస్తామని, గులాబీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. కాగా అవిశ్వాస రగడ సద్దుమణగాలంటే మరో 20 రోజులు ఆగాల్సిందే.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలి

- గృహలక్ష్మిని రద్దు చేయడం విడ్డూరం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, జనవరి 5: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు రూ. 7,500 ఇస్తామని, ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యాడని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండిపడ్డారు. వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రసమయి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులవుతున్నా ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని నిలదీశారు. ఇచ్చిన హామీలను తప్పించుకోవడానికే ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిని అడ్డుకోవడం, కాంట్రాక్టర్లను బెదిరించడం మానుకోవాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

17లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 5: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఈనెల 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులకు దరఖాస్తుల ఆన్‌లైన్‌పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తులు ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి జిల్లాలో మండలాల వారీగా బృందాలను నియమించినట్లు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి ఆపరేటర్ 750 దరఖాస్తుల చొప్పున వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తప్పులు దొర్లకుండా చూడాలని, ప్రతి ఫారం ఆన్‌లైన్ ఎంట్రీ కావాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ముగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రాజు, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, టీం లీడర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల పరిశీలన

చొప్పదండి, జనవరి 5: ప్రజాపాలన దరఖాస్తులను నేటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. చొప్పదండి పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ప్రతిరోజు ఆపరేటర్ 750 దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్లు వేణుమాధవ్, శాంతకుమార్, తహసీల్దార్ నరేందర్, కౌన్సిలర్ నలుమాచు జ్యోతి-రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 5: ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వెన్కేపల్లిలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో 26 గ్రామాల కార్యకర్తలతో వేర్వేరుగా మాట్లాడారు. తనను గెలిపించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణానికి అవకాశం కల్పించామన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపల్లి కిష్టయ్య, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

నేడు చిగురుమామిడికి మంత్రి రాక

చిగురుమామిడి, జనవరి 5: మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మండల, జిల్లా నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, జనవరి 5: రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ కార్యాలయంలో శుక్రవారం పట్టణాధ్యక్షుడు నగునూరి రాజేందర్, ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. కోశాధికారి వెంకటేశ్, శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

PLOT FOR SALE

★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-319319

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కలెక్టరేట్, జనవరి 5: ప్రజాపాలన దరఖాస్తుల వివరాల డాటా ఎంట్రీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో మహలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, వివిధ కుటుంబాల వివరాల డాటా ఎంట్రీపై డీటీవో, డీపీవో, మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రపుల్ దేశాయ్ మాట్లాడారు. శిక్షణ అనంతరం సిబ్బందిని రెండు బృందాలుగా విడదీసి, రోజుకు రెండు షిఫ్టుల వారీగా వెబ్‌సైట్‌లో ప్రజాపాలన దరఖాస్తుల వివరాల నమోదు ప్రక్రియను చేపడుతామన్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా డాటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీపీవో కొమురయ్య పాల్గొన్నారు.

పథకాల కోసం దరఖాస్తు చేసుకోండి

దరఖాస్తు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 5: ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని మేయర్ వై సునీల్‌రావు సూచించారు. నగరంలోని 33వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పోలీస్ క్వార్టర్స్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయించాలని స్థానికులు మేయర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శనివారంతో కార్యక్రమం ముగుస్తున్నందన దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటి వరకు 67 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ

నగరంలోని పలువురు పేదలకు అలయన్స్ క్లబ్ ఆఫ్ భగత్‌నగర్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం వద్ద మేయర్ సునీల్‌రావు చేతుల మీదుగా బియ్యం పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పండగ నాగరాజు, ప్రధాన కార్యదర్శి కట్కూరి సుధాకర్, గుడాల కృష్ణ, గీకురు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యు ఒడిలోకి

హుజూరాబాద్ రూరల్, జనవరి 5: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన కాట్రపల్లిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల కుమారస్వామి(36) శుక్రవారం గ్రామ సమీపంలోని మైసమ్మ చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. కుమారస్వామికి కుమారుడు ఉన్నాడు. కాగా, రెండేండ్ల క్రితం కుమారస్వామి భార్య అనారోగ్యంతో మృతి చెందింది.

16 నుంచి రైతులు ఆర్డీవో కార్యాలయానికి రావాలి

కరీంనగర్ రూరల్, జనవరి 5: జిల్లాలో ఎన్‌హెచ్-563 నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులు భూమి పత్రాలతో ఆర్డీవో కార్యాలయానికి ప్రకటించిన తేదీల్లో రావాలని ఆర్డీవో మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న గంగాధర మండలం వెంకటాయపల్లి, ఇస్లాంపూర్, 17న గంగాధర, 18న కురిక్యాల రైతులు రావాలని పేర్కొన్నారు. 19న రామడుగు మండలం వెదిర, 20న దేశరాజ్‌పల్లి, 23న కొక్కెరకుంట, 24న వన్నారం, 25న కొత్తపల్లి మండల పరిధిలోని రైతులు రావాలని తెలిపారు. 27న కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, 30న జూబ్లీనగర్, 31న ఎలబోతారం, ఫిబ్రవరి ఒకటిన ఇరుకుల్ల రైతులు భూమి పత్రాలతో ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుడు రవినాయక్

విద్యానగర్, జనవరి 5: రాంనగర్‌లోని ఆయూష్ దవాఖానలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆయూష్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఆయూష్ శాఖ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుడు డాక్టర్ బీ రవినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. కరీంనగర్ ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సంజీవ్‌కుమార్, ఆయూష్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవసాని సుధాకర్, ప్రధాన కార్యదర్శి సిరిపురం రాజేశ్వర్, కోశాధికారి విజయేందర్, ఉపాధ్యక్షులు జలంధర్, పుష్పలత, సంయుక్త కార్యదర్శులు ఉమాపతి, లక్ష్మణ్, ప్రేమలత, శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేశ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, రీటా, సునీత, నిర్మల, బ్రహ్మచారి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల ఫార్మసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యవర్గం

కార్పొరేషన్, జనవరి 5: కరీంనగర్‌లోని సదా మీ సేవాలో స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా చింత క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా చిందం వెంకటేశ్, కార్యదర్శిగా రావుల అనిల్‌కుమార్, కోశాధికారిగా రంగ సంతోష్, కార్యవర్గ సభ్యులుగా శీలం నవీన్, దైడ తిరుపతిని ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బేజగం మధు తెలిపారు. రాబోయే రోజుల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఉపాధి బిల్లులకు ఆధార్‌తో ముడిపెట్టడం సరికాదు

కలెక్టరేట్, జనవరి 5: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వేతన బిల్లుల చెల్లింపును ఆధార్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలనగర్‌లోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కూలీల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఈ పథకాన్ని ఎత్తేసే క్రమంలోనే కేంద్రం సవాలక్ష ఆంక్షలు విధిస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఆధార్, బ్యాంకు ఖాతాలను జాబ్ కార్డులతో అనుసంధానం చేసుకోవడం తెలియక అనేక మంది ఇప్పటికీ వాటికి దూరంగా ఉన్నారన్నారు. అలాంటి వారి జాబ్ కార్డులను ఈనెల నుంచి తొలగిస్తున్నారని వాపోయారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

మానకొండూర్ రూరల్, జనవరి 5: పచ్చునూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి ప్రధానోపాధ్యాయుడు కే మధుకర్ చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశాడు. 23 ఏండ్లుగా పదో తరగతి విద్యార్థులకు దామోదర్ రెడ్డి స్వయంగా ఇంగ్లిష్ సబ్జెక్ట్ స్టడీ మెటీరియల్స్‌ను కొనుగోలు చేసి అందజేస్తున్నాడు.

ఒకరు డిబార్

తిమ్మాపూర్, జనవరి 5: ఎల్ఎండీ కాలనీలోని డైట్‌లో జరుగుతున్న డీఈఈడీ పరీక్షల్లో కాపీ కొడుతూ దొరికిన ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థిని డీబార్ చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీరాం మొండయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం డీఈడీ రెండో సంవత్సరం పరీక్ష నిర్వహించగా ఓ విద్యార్థి చీటి పెట్టి రాస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

రామజన్మభూమి అక్షింతల పంపిణీ

కమాన్‌చౌరస్తా, జనవరి 5: అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలను శుక్రవారం పదో డివిజన్‌లో కార్పొరేటర్ కాసర్ల ఆనంద్-లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో, గణేశ్‌నగర్‌లోని వినాయక టవర్స్, శక్తి టవర్స్‌లో పీ సుజాత రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అరిచర్ల రాజు, కాసర్ల వేణు, రాజమల్లయ్య, సంపత్, శ్రీనివాస్, ఇళయరాజ, హన్మాండ్లు, లింగారెడ్డి, ప్రతాపరెడ్డి, శ్వేతా రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి

హౌసింగ్‌బోర్డుకాలనీ/తెలంగాణచౌక్, జనవరి 5: పీపుల్స్ పార్టీ ఇండియా (డెమోక్రటిక్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా గంగారపు తిరుపతిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తనపై నమ్మకంతో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల వన భోజనాలు

తెలంగాణచౌక్, జనవరి 5: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని ఆయా డిపోల్లో శుక్రవారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. డీఆర్ఎం సత్యనారాయణ, సెక్యూరిటీ అధికారి భానురావు, డీఎంలు మల్లయ్య, మల్లేశం, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలకు సత్కారం

కమాన్‌చౌరస్తా, జనవరి 5: నగరంలోని పాతబజార్ చిన్న హనుమాన్ ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు 42 రోజుల పాటు అన్నదానం చేసిన దాతల కుటుంబ సభ్యులకు, దీక్షాపరులకు శుక్రవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు అనంతుల పురుషోత్తం, నలుమాచు విజయ్ కార్పొరేటర్లు శ్రీదేవి-పవన్‌కుమార్, మంజుల-రమేశ్, మాలతి-సంపత్, వాసు, శ్రీనివాస శర్మ, ధనుంజయ్, బీ శ్రీనివాస్, పీ శ్రీనివాస్, మహేశ్, రంజిత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, జనవరి 5: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వివరించారు.

పాలం పనులు చేస్తూ కౌలు రైతు మృతి

శంకరపట్నం, జనవరి 5: ఓ కౌలు రైతు పొలం పనులు చేస్తూ మృతిచెందిన ఘటన మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాతంగి ఓదెలు (53) రెండేళ్లుగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ భూమి కౌలుకు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం పది గంటల ప్రాంతంలో ఓదెలు పొలం వద్దకు వెళ్లగా, భార్య కమలమ్మ పత్తి ఏరడానికి వెళ్లింది. సాయంత్రం అయినా ఓదెలు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. కాగా, ఒడ్లు చెక్కుతున్న క్రమంలో గుండెపోటు వచ్చి పొలంలోనే పడి మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు భావిస్త